క్లుప్తంగా

తహసీల్దార్ శాంతికి సత్కారం



గూడూరు: మండల తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఏలూరు జిల్లాకు వెళ్లిన ఎస్.ఎస్.శాంతిని మండల రెవెన్యూ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఎన్నికల కమిషన్ సార్వత్రిక ఎన్నికలకు ముందు నిర్వహించిన బదిలీలలో శాంతి గూడూరు తహసీల్దారుగా నియమితులయ్యారు. తాజాగా ఇతర జిల్లాల నుంచి బదిలీ అయిన తహసీల్దార్లను వారి జిల్లాలకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సోమవారం ఎస్.ఎస్.శాంతి గూడూరు నుంచి రిలీవ్ అయ్యారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి తహసీల్దారుగా బాధ్యతలు తీసుకున్న డీటీ వై.శివశంకర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది బుధవారం ఆమెను ఘనంగా సత్కరించారు. దుశ్శాలువాలు, పూలదండలతో సత్కరించి ఆమెకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో వీఆర్వోలు కరిముల్లా, ప్రసాద్, బషీర్, సుబ్బారావు, వరప్రసాద్, వెంకటేశ్వరరావు, నరేష్, కల్యాణి, ఉషారాణి, కార్యాలయ సిబ్బంది, వీఆర్ఏలు పాల్గొన్నారు.

జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా సుందరాచారి

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీ సుందరాచారిని నియమిస్తూ డీఎంఏ నరసింహులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న జీఎస్ రమేష్‌కుమార్ బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. పూర్తి బాధ్యతలతో సూపరింటెండెంట్‌ను నియమించేలోగా సుందరాచారిని నియమించారు. జీఎస్ రమేష్‌కుమార్ ఏడాది కాలంగా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విజయవాడ జీజీహెచ్‌లో ఆప్తమాలజీ హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్‌గా పనిచేసిన రమేష్‌కుమార్ ఇక్కడ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. ఇటీవలే డెప్యూటీ డీఎంఏగా ఈయన ఉద్యోగోన్నతి పొందారు.

ఉద్యోగ విరమణ పొందిన హెచ్‌సీకి సన్మానం



కోనేరుసెంటర్: పోలీసుశాఖకు సుదీర్ఘకాలం పాటు సేవలను అందించి ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉద్యోగ విరమణ పొందటం అనేది అదృష్టంగా భావించాలని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు అన్నారు. జిల్లాలోని పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన మహమ్మద్ అయూబ్‌ను బుధవారం ఎస్పీ తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందికి పోలీసుశాఖ నుంచి ఎపుడు ఎలాంటి సహకారం కావాలన్నా ఉంటుందన్నారు. పోలీసుశాఖ తరపున అందాల్సిన ప్రయోజనాలను సకాలంలో అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఏఎస్పీ జి వెంకటేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ ప్రసాద్, ఇతర అధికారులు, అయూబ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గుండేరు కట్టపై రోడ్డుకు మరమ్మతులు



చిట్టూర్పు(ఘంటసాల): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని చిట్టూర్పు – ఘంటసాల వయా జోడుగూడెం గుండేరు కట్టపై నిర్మించిన రోడ్డు కుంగిపోగా రోడ్డు మరమ్మతు పనులను బుధవారం ప్రారంభించారు. దీనికి సంబంధించిన వివరాలను ఆర్అండ్‌బీ డీఈ వరలక్ష్మి తెలిపారు. సుమారు ఆరు నెలల క్రితం జోడుగూడెం నుంచి ఘంటసాల మార్గంలో గుండేరు కట్టపై 500 మీటర్ల రోడ్డును రూ.70 లక్షలతో నిర్మించారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద నీరు రావడంతో కరకట్ట భూమి అడుగున కోతకు గురికావడంతో ఒక చోట భారీగా, రెండు, మూడు చోట్ల తాత్కాలికంగా రోడ్డు కుంగిందన్నారు. దీంతో కాంట్రాక్టర్‌తో ఉన్న ఒప్పంద కాలపరిమితి ఉండటంతో కాంట్రాక్టర్‌తో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టినట్లు డీఈ వరలక్ష్మి తెలిపారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

ఘంటసాల: మండలంలో పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో బి.మారుతీ శేషమాంబ బుధవారం తెలిపారు. మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో 7,175 మంది వివిధ రకాల పెన్షనర్లు ఉండగా రూ.2,93,05,500 నగదు సంబంధిత గ్రామ సచివాలయాల కార్యదర్శుల ద్వారా పంపిణీ చేసే ఉద్యోగులకు అందించామన్నారు. ఉదయం 6 గంటల నుంచే పెన్షన్లు పంపిణీ చేయాలని సచివాలయ, పంచాయతీ ఉద్యోగులకు ఎంపీడీవో చెప్పారు.

ఆదాయం రాబట్టేందుకు కృషి చేద్దాం





కౌన్సిల్‌కు అధ్యక్షత వహించిన మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి, కౌన్సిల్ సమావేశానికి హాజరైన కౌన్సిల్, కోఆప్షన్ సభ్యులు

- మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి
- అధ్యయనం చేసేందుకు ప్రత్యేక బృందం
- అధికారులు వార్డుల్లోకి వెళ్తే కౌన్సిలర్లకు సమాచారం ఇస్తే వారూ వస్తారు
- కౌన్సిల్ అత్యవసర సమావేశంలో అజెండాలోని 23 అంశాలపై చర్చ

పెడన: పురపాలక సంఘానికి చెందిన చెరువులకు వేలం నిర్వహించినా ఎవరూ ఆసక్తి చూపకపోవడంపై అధ్యయనం చేసి ఆయా చెరువుల ద్వారా ఆదాయం వచ్చేలా కృషి చేద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. బుధవారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో కౌన్సిల్ అత్యవసర సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన జరిగింది. అజెండాలోని 23 అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘానికి చెందిన చెరవులకు వేలం నిర్వహించినా ఎవరూ ముందుకు రాకపోవడాన్ని కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. 9వ వార్డు కౌన్సిలర్ గరికిముక్కు చంద్రబాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం చెరువుల నిర్వహణ నిమిత్తం కొంత నిధులను కేటాయిస్తున్నారని, ఆయా చెరువులను అభివృద్ధి చేయకపోవడం కారణంగా లేదా చెరువులు వాస్తవ పరిస్థితులకు భిన్నంగా విస్తీర్ణం కాగితాల్లో చూపి వేలం నిర్వహిస్తున్నారా లేక ఆక్రమణలు గురికావడం వల్ల పాటదారులు రావడం లేదా అని ప్రశ్నించారు. ఇదే పరిస్థితి ఉంటే మాత్రం తక్షణం ఆయా చెరువుల విస్తీర్ణాన్ని రికార్డుల ప్రకారం ఉందో లేదో సర్వే చేయాలన్నారు. 2018లో సర్వే చేయాలని లిఖితపూర్వకంగా పేర్కొవడమే కాకుండా చలనాలు కూడా కట్టామని, నేటి వరకు సర్వే చేయలేదన్నారు. ఈ విషయమై టీపీవో ఏసుబాబు స్పందిస్తూ మండల సర్వేయర్‌కు సమయంలేక రావడం లేదని బదులిచ్చారు. సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ స్పందిస్తూ చెరువుల ద్వారా ఆదాయం పెంచుకునేందుకు ప్రత్యేకంగా అధికారులతో పాటు కౌన్సిల్ సభ్యులుండేలా ప్రత్యేక కమిటీ వేసి అధ్యయం చేయిద్దామన్నారు. మున్సిపల్ ఆదాయం పెంచడానికి అంతా కలిసి కృషి చేద్దామని స్పష్టం చేశారు. చెరువుల సర్వే చేయడానికి రెవెన్యూ అధికారులను కోరుదామని తెలిపారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో ఇద్దరు పారిశుద్ధ్య పనివారికి, సెప్టిక్ ట్యాంక్ వారికి చెల్లింపుల విషయంలో 11, 12 అంశాలపై 12వ వార్డు కౌన్సిలర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. వీటిపై కమిషనర్ బి. వెంకటరామయ్య స్పందిస్తూ ఎన్నికల అత్యవసరం దృష్ట్యా ముందుగా మనం చెల్లింపులు చేస్తున్నామని, ఎన్నికల సంఘం నుంచి నిధులు రాగానే మళ్లీ జమ చేస్తామని తెలిపారు. ఎన్నికల సంఘం నుంచి వచ్చినప్పుడే చెల్లింపులు చేయాలని, అప్పటి వరకు చెల్లింపులు చేయవద్దని జనసేన కౌన్సిలర్ శివపార్వతి అన్నారు. పనివారు ఆగరని, అలాంటివి ఉంటే తక్షణం చెల్లించాల్సిందేనని కమిషనర్ అన్నారు. దీంతో 11, 12 అంశాలకు డిసెంట్ ఇస్తున్నానని ఆమె అన్నారు. ఈ రెండు అంశాల విషయంలో సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్‌కు, శివపార్వతికి మధ్య తీవ్రస్థాయిలో వాదోపవాదాలు జరిగాయి. పట్టణంలో ఆక్రమణలు ఎన్ని ఉన్నాయి, ఆర్ అండ్ బీ పరిధిలో ఎన్ని ఉన్నాయనే దానిపై పూర్తిస్థాయిలో సర్వే చేయాలని పాలకవర్గ సభ్యులు అధికారులకు సూచించారు. 19వ వార్డు కౌన్సిలర్ శిరివెళ్ల జయేష్ అడిగిన ఒక ప్రశ్నకు కటకం ప్రసాద్ సమాధానం ఇస్తూ కమిషనర్ ఆయా వార్డులలోకి వెళ్లే ముందు సంబంధిత కౌన్సిలర్లకు ముందస్తు సమాచారం ఇస్తే ఆ కౌన్సిలర్ కూడా మీతో పాటు తిరుగుతారని, వార్డు సమస్యలను మీ దృష్టికి తీసుకువస్తారని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బైలపాటి జ్యోతి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

టోఫెల్ శిక్షణ రద్దుతో పేద విద్యార్థులకు అన్యాయం

దళిత బహుజన పరిరక్షణ సంఘం జిల్లా కార్యదర్శి గాంధీ

మచిలీపట్నంటౌన్: టోఫెల్ శిక్షణ రద్దు చేస్తామని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పేర్కొనటం పేద విద్యార్థులకు అన్యాయం చేయటమేనని దళిత బహుజన పరిరక్షణ సంఘం జిల్లా కార్యదర్శి ఎగ్గోని గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం ఇంగ్లిషు మీడియం బైలింగ్వల్ టెక్స్ట్ బుక్స్ ద్వారా పేద విద్యార్థులకు ఇంగ్లిషు భాష ను సులభంగా నేర్చుకునేందుకు సరళతరం చేసిందన్నారు. దీంతోపాటు ప్రభుత్వ బడుల్లో టోఫెల్ ట్రెనింగ్ అమలు కోసం అంతర్జాతీయ సంస్థ అయిన ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్ (ఈటీఎస్)తో ఒప్పందం చేసుకుందన్నారు. ఈ విధానంతో రాష్ట్రంలోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం లభిస్తుందని ఆశించిన నేపథ్యంలో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం టోఫెల్ విధానాన్ని రద్దు చేసేందుకు ప్రయత్నించటం విచారకరమన్నారు. ఇంగ్లిషు నేర్చుకోవాలన్న పేద విద్యార్థుల కలను తుంచి, వారిని తిరోగమనానికి నెట్టేందుకు ప్రభుత్వం చూస్తోందన్నారు. ఈ చర్యను దళిత బహుజన సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు ముక్తకంఠంతో ఖండించాలన్నారు. టోఫెల్ శిక్షణను అమలు చేసేలా డిమాండ్ చేయాలని గాంధీ కోరారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి



గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ సభ్యులు బుధవారం మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఎం.శివరామకృష్ణ మాట్లాడుతూ ఐ లవ్ గుడివాడ కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని స్థానిక 36వ వార్డు నాగవరప్పాడు మెయిన్ రోడ్‌లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి ఇంటి వద్ద ఒక మంచి మొక్కను నాటి దాని పరిరక్షణను ఆ ఇంటి యజమానికి అప్పగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కె.రామారావు, కోశాధికారి కె.రామకృష్ణ, జెడ్‌సీ పి. సత్యనారాయణ, డిప్యూటీ గవర్నర్ అర్జా ప్రసాదు, ప్రాజెక్ట్ చైర్మన్ ఎల్.శివరామ్ ప్రసాద్, సభ్యులు వి.బ్రహ్మాజి, ఎం.హనుమంతరావు, ఎస్.ప్రసాద్, ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

బంటుమిల్లి: తల్లిపాల వారోత్సవాలు గురువారం నుంచి వారం రోజులపాటు నిర్వహిస్తున్నట్టు ఐసీడీఎస్ బంటుమల్లి ప్రాజెక్టు సీడీపీవో ఎం.సముద్రవేణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని గ్రామ, గ్రామాన అంగన్‌వాడి కేంద్రాల పరిధిలో తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులకు, బాలింతలకు అవగాహన సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి స్థానిక ప్రజాప్రతినిధులు, బాలింతలు, గర్భిణులు సహకరించాలని సీడీపీఓ సముద్రవేణి కోరారు.

పంట కాలువలో పూడికతీత



14వ నంబర్ పంట కాలువలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

కోడూరు: మండలంలోని తీరప్రాంత పొలాలకు వెళ్లే 14వ నంబర్ పంటకాలువలో ఇరిగేషన్ అధికారులు పూడికతీత పనులను ముమ్మరంగా నిర్వహించారు. సముద్రతీర ప్రాంతాలైన బసవానిపాలెం, రామకృష్ణాపురం, ఊటగుండం, ఇరాలి పంటకాలువలకు సాగునీరు వెళ్లలేదంటూ జూలై 27న 'సాక్షి' దినపత్రికలో 'సాగుకు నీటి చుక్క లేదు' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైయింది. ఈ కథనానికి స్పందించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ వెంటనే 14వ నంబర్ పంటకాలువ పూడికతీత పనులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. దీంతో 5,400 ఎకరాల ఆయకట్టు కలిగిన ఈ కాలువలో మూడున్నర కి.మీ మేర పూడిక, ఇతర పనుల నిర్వహణకు రూ.14.53 లక్షలను అధికారులు కేటాయించారు. ఈ మేరకు మూడు రోజుల నుంచి అధికారులు యంత్రాల సహాయంతో కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూటికాడ, మట్టిదిబ్బలను తొలగిస్తున్నారు. ప్రస్తుతం ద్వారకా గ్రామం వరకు పూడికతీత పనులు పూర్తయినట్లు ఇరిగేషన్ డీఈ రవికిరణ్ తెలిపారు. ద్వారక నుంచి బసవానిపాలెం వరకు కాలువలో, ఊటగుండం కాలువలో తూడు, గుర్రపుడెక్క చనిపోయేందుకు మందు పిచికారీ చేయనున్నట్లు చెప్పారు. అనంతరం ఈ కాలువలో కూడా పూడికతీత చేపట్టనున్నట్లు డీఈ తెలిపారు.

సాగునీరు లేక ఎండిపోతున్న వరినాట్లు



ఘంటసాలలో ఎండిపోతున్న వరి మొక్కలు



సాగునీరు లేక వెలవెల బోతున్న ఘంటసాల 3/2 ఛానల్ కాలువ

ఘంటసాల: మండల కేంద్రమైన ఘంటసాల గ్రామంలోని 3/2 ఛానల్‌కు సాగునీరు విడుదల కాకపోవడంతో నాట్లు వేసిన పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చానల్ కింద 2000 ఎకాల ఆయకట్టు ఉంది. 1500 ఎకరాల వరకు నాట్లు వేశారు. కొద్దిరోజుల కిందట కురిసిన వర్షాలకు వరద నీటికి కాలువల ద్వారా వచ్చిన నీటితో నాట్లు వేశామన్నారు. మరో 500 ఎకరాల్లో నాట్లు వేయాల్సి ఉంది. ఆ తర్వాత సాగునీరు విడుదల చేస్తారని రైతులు భావించారు. తీరా పది రోజులు గడుస్తున్నా నేటికీ పంట కాలువకు సాగునీరు రాకపోవడంతో వరి మొక్కలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ఎకరాల రైతులు ఇంజిన్ల సహాయంతో పక్కనే ఉన్న మరో డ్రెయిన్ నుంచి పొలాలు తడుపుకుంటున్నారు. నీరు అందుబాటులోలేని 200 ఎకరాల్లో వరి నాట్లు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి వెంటనే 3/2 చానల్‌కు సాగునీరందించాలని రైతులు వేడుకుంటున్నారు.

మొరాయిస్తున్న బోర్లు



మోపిదేవివార్పు వద్ద 12వ నంబర్ కాలువలో ఏపుగా పెరిగిన గుర్రపుడెక్క

కోసూరువారిపాలెం(మోపిదేవి): సాగునీరు విడుదల చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండంలోని కోసూరువారిపాలెం పరిధిలోని నడిమిలంకలో సుమారు 200 ఎకరాల్లో వరి సాగు ప్రశ్నార్థకంగా మారనుంది. మోపిదేవి వార్పువద్ద 12వ నంబర్ కాలువ ద్వారా సాగునీరు విడుదల చేయాల్సి ఉంది. ఈ కాలువలో తూటికాడ బాగా పెరిగిపోవడంతో సాగునీరు విడుదల చేయలేదని రైతులు విచారం వ్యక్తం చేశారు. కాలువ నీరు ఉంటేనే భూగర్భ జలాలు పెరిగి విద్యుత్ మోటర్లు పనిచేస్తాయని, ప్రస్తుతం ఆ బోర్ల ద్వారా కూడా తక్కువగా నీరు వస్తుందని వాపోయారు. కోసూరువారిపాలెంతో పాటు ఈ కాలువ కింద మేళ్లమర్తిలంక, ఉత్తరచిరువోలు లంక రైతాంగం వరి సాగు ప్రశ్నార్థకంగా మారుతుందని ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి 12వ నంబర్ కాలువకు సాగునీరు త్వరితగతిన అందించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

రేపు జాబ్ మేళా

జిల్లా ఉపాధి కల్పనాధికారి దేవరపల్లి విక్టర్‌బాబు

మచిలీపట్నంటౌన్: ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈనెల 2న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి దేవరపల్లి విక్టర్‌బాబు బుధవారం తెలిపారు. ఐటీ రంగంలో వీరికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నామన్నారు. ఇంటర్‌లో 75 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి. స్థానిక లేడియాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 2న ఉదయం 9 గంటల నుంచి ఇంటర్వ్యూలు మొదలవుతాయని చెప్పారు. ఎంపిక ప్రక్రియలో భాగంగా తొలుత కెరీర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (క్యాట్) మరో రెండు పరీక్షలు నిర్వహిస్తారు. ఈ మూడింటిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఏడాది శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ కాలంలో ఏడో నెల నుంచి నెలకు రూ.10 వేల చొప్పున స్టైఫండ్ ఇస్తారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 2022–23, 2023–24 విద్యాసంవత్సరాల్లో ఇంటర్ పూర్తి చేసిన, ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ ఉద్యోగాలకు అర్హులు. వీరికి ఇంటర్‌బోర్డు, హెచ్‌సీఎల్ టెక్‌బీ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.

నాగేశ్వరరావు సేవలు ఆదర్శనీయం



నాగేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

కోడూరు: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు అందించిన సేవలు ఆదర్శనీయమని ఎంఈఓ టి.వి.ఎం. రామదాసు అన్నారు. మండలంలోని పోటుమీద ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయుడు పట్టంశెట్టి నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ సభ బుధవారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. 41 సంవత్సరాల నుంచి ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ నాగేశ్వరరావు తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారని ఎంఈఓ కొనియాడారు. అనేక మంది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు వేశారని ప్రశంసించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఏవిధమైన రిమార్క్ లేకుండా విధులు నిర్వహించారని ఎంఈఓ తెలిపారు. అనంతరం నాగేశ్వరరావు దంపతులను ఎంఈఓ, పలు యూనియన్ నాయకులు సత్కరించారు. ఎంఈఓ–2 శ్రీనివాసరావు, డెమోక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్, డీపీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులు రాఘవ, శ్రీనివాసరావు, మండలాధ్యక్షుడు అప్పికట్ల సాంబశివయ్య, ప్రధాన కార్యదర్శులు జరుగు నరసింహారావు, డి.మోహనరావు, పెరవలి రాంబాబు, మన్నె ప్రేమ్ చంద్, పులి బైరాగి, తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతకు మారుపేరు 'దారపు'

గవర్నర్ కార్యాలయ జాయింట్ సెక్రటరీ సూర్యప్రకాష్



శ్రీనివాసరావు దంపతులను సన్మానిస్తున్న ఏపీ ఎన్జీవోల రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, ఉద్యోగులు

చిలకలపూడి(మచిలీపట్నం): విధి నిర్వహణలో దారపు శ్రీనివాస్ అంకితభావం, నిబద్ధత కలిగి ఉండేవారని గవర్నర్ కార్యాలయ జాయింట్ సెక్రటరీ పీఎస్ సూర్యప్రకాష్ అన్నారు. గుడ్లవల్లేరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తూ బుధవారం ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా జిల్లా పరిషత్ సమావేశపు హాలులో శ్రీనివాస్ దంపతులకు వీడ్కోలు కార్యక్రమాన్ని పంచాయతీరాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సూర్యప్రకాష్ మాట్లాడుతూ శ్రీనివాస్‌కు విధి నిర్వహణలో ఏదైనా పని చెప్పినప్పుడు ఆ పనిని కచ్చితంగా చేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందేవారన్నారు. ఇటువంటి వారిని నేటి ఉద్యోగులు ఆదర్శంగా తీసుకుని పనిచేయాలన్నారు. జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈవో ఆనందకుమార్ మాట్లాడుతూ శ్రీనివాస్ ఎటువంటి పనినైనా చిరునవ్వుతో స్వీకరించి ఆ పనిని కచ్చితంగా నిర్ణీత సమయంలో చేసేవారన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేవీ శివారెడ్డి మాట్లాడుతూ సంఘపరంగా ఎంతో మంది ఉద్యోగులకు ఆయన సేవలు అందించారన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కార విషయంలో పూర్తి బాధ్యతలు తీసుకుని పనిచేసేవారన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉల్లి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ వెస్ట్ కృష్ణ జిల్లా అధ్యక్షుడు ఏవీ సాగర్, వెస్ట్ గోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, పే అండ్ ఎకౌంట్స్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ హరినాథ్, ట్రెజరీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శోభన్‌బాబు, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ జెడ్పీ యూనిట్ నాయకులు ఆర్ హేమప్రకాష్, చలమలశెట్టి లక్ష్మీశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం దారపు శ్రీనివాస్ దంపతులను ఘనంగా సత్కరించారు.

నోట్ పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న పర్వతనేని ఆనంద్

గుడివాడ టౌన్: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. స్థానిక సత్యనారాయణపురంలోని భవిత కేంద్రం (దివ్యాంగుల శిక్షణ కేంద్రం)లో ప్రముఖ వ్యాపారవేత్త, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పర్వతనేని ఆనంద్ వితరణతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్, పట్టణ ప్రముఖులు బొగ్గారపు తిరుపతయ్య, లయన్స్‌క్లబ్ జీసీ వైవీ కృష్ణారావు, జాజుల తాతారావు, ఎం.సత్యం, కె.హరిబాబు, కేంద్రం నిర్వాహకులు ఎంకె.నీలాంబ్రమ్, ఎస్‌కె.ఫజీల్ పాల్గొన్నారు.

రక్షిత తాగునీరు అందించేందుకు కృషి



అవనిగడ్డలో డ్రెయిన్ పరిశీలన అనంతరం అధికారులతో మాట్లాడుతున్న బుద్ధప్రసాద్

అవనిగడ్డ: నియోజకవర్గ ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. మండల పరిధిలోని వేకనూరులో రక్షిత మంచినీటి పథకాన్ని ఆయన పరిశీలించారు. ఓవర్‌హెడ్ ట్యాంకు, రక్షిత మంచినీటి చెరువు, ఫిల్టర్ బెడ్స్‌ను ఆయన పరిశీలన చేశారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ వేకనూరులో మైక్రో ఫిల్టర్స్‌ని ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం సీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులను ఇబ్బందులు పెట్టకుండా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి.సత్యనారాయణ, ఏఈ భోగాది జగత్, ఉప సర్పంచ్ తుంగల మురళీకృష్ణ, తుంగల రాజేష్, పలువురు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

అవనిగడ్డలో డ్రెయిన్ సమస్య పరిష్కారానికి కృషి

అవనిగడ్డ పంచాయతీలో డ్రెయినేజీ సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చెప్పారు. స్థానిక పంచాయతీ పరిధిలోని సీతాయమ్మ హోటల్ ప్రాంతంలో మురుగు డ్రెయిన్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొల్లూరి వెంకటేశ్వరరావు, డ్రెయినేజీ ఏఈ భోగాది జగత్, పంచాయతీ ఈవో తోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టు పవిత్రాలు అందజేత

మోపిదేవి: అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కుటుంబ సభ్యులకు పట్టు పవిత్రాలు బుధవారం అందజేశారు. మోపదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి జన్మనక్షత్రం ఆషాఢ ఆడికృత్తిక పవిత్రోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా పట్టు పవిత్రాలను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు ఇంటి వద్ద ఉదయం అందించి స్వామివారి ఆశీర్వచనాలు వేదపండితులు అందజేశారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావుతో పాటు ఆలయ అర్చకులు బుద్ధు సతీష్ శర్మ, వేదపండితులు మణిదీప్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



గుడివాడ టౌన్: స్థానిక కేటీఆర్ మహిళా కళాశాల విద్యార్థులకు గుడివాడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక గురురాజు ప్రభుత్వ హోమియో కళాశాలకు చెందిన వైద్యులు ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో విద్యార్థినులకు స్త్రీలకు సంబంధించిన వైద్య సూచనలు, సలహాలపై అవగాహన సదస్సు నిర్వహించి, అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సుష్మ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పి.నిర్మల, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎన్.శేషగిరి, కార్యదర్శి ఎ.నవీన్, సభ్యులు ఉపద్రష్ట రాంబాబు, డాక్టర్ రామ్ నారాయణ్ పాల్గొన్నారు.